# శునకావతారము

"అయ్యా! మొగుడుగారూ!"

శాస్త్రోక్తంగా మెడలో మూడు ముళ్లేయించుకున్న అర్థాంగి సంబోధనతో నెత్తిమీద పాము పడ్డట్టయింది ముత్యాలరావుకు. ఉలిక్కిపడి చూశాడు. "అదేంటీ! ఆ ముతక సంబోధనేమిటి?" నోరెళ్లబెట్టి బొమ్మలా నుంచున్నాడు.

"కొత్తొక వింత, పాతొక రోత అన్నారు గదా!" కిసుక్కుమంది. "వింతలు విశేషాలిప్పుడెందుగ్గానీ... విషయమేమిటో చెప్పండి సంపుగారూ!" చేతులు కట్టుకుని కుక్కపిల్లలా నుంచున్నాడు.

"నా పేరు.... సంపంగి" మూతి మూడు వంకర్లు.

"మా అమ్మా నాన్నలు నాకు ముద్దుగా..."

"ముత్యాలరావని నామకరణం చేశారు. అందరూ ముద్దుముద్దుగా ముత్యం అంటున్నారు."

"మరైతే కొత్తగా అదేమిటీ?" ధైర్యంగా చెంపలందుకో బోయాడు. "ఆ... ఆగాలి. మనబ్బాయి ఇంట్లోనే ఉన్నాడు." నల్లని కనురెప్పలు తుమ్మెదరెక్కల్లా టపటపలాడినై. సంపంగి బుగ్గలు ఎర్రమందారాల్లా విచ్చుకున్నాయి. సిగ్గుల బుగ్గలకు అరచేతులడ్డంపెట్టుకుని 'సంపూ ఏమిటీ... కంపు. అయినా ఇది పట్ట పగలండీ బాబూ!" కళ్లు మూసుకుంది.

"అద్సరే గాని... నేను ఆఫీసు కెల్తున్నానోయ్!"

"ఆ ఆ" చిరుకోపం. "మున్సిపలాఫీసు గుమాస్తానని మురిసిపోతూ నోటి దురుసుతన్నాన్ని పెంచుకోకండి. ఎదుటి వారితో మర్యాదగా మాట్లాడ్డం గూడా ఒక కళనే. ఆరోగ్యానిగ్గూడా మంచిది. బైకు దారిలో ఆపి బాతాకానీకి దిగొద్దు. మీమీద ఎవరిక్కోపమొచ్చినా బైకుమీద దాడిచేస్తారు. అది మా నాన్న కొనిచ్చిన బైకు అని మరవద్దు సుమా!" పెదాలు చప్పరించింది.

అయితే ఒలకబోస్తున్న ప్రేమంతా నామీద కాదు, బైకుమీదన్నమాట... ఎక్కడో మండింది. ఈ ముదనష్టపు బైకు చేతికొచ్చిన వేళావిశేషమేమిటో గాని... ఎప్పుడో ప్రమోషనొచ్చి ఎగువ కుర్చీమీద కూర్చోవాల్సిన వాణ్ని... ఎమోషన్ తప్ప ప్రమోషన్ రాలేదు. మా మున్సిపలాఫీసులో నేనే సీనియర్ గుమాస్తాను...ప్చ్... దేనికైనా ప్రాప్తముండాలి...

"సరేలేవోయ్!" పాంటు జిబ్బు సవరించుకుంటూ గడప దాటాడు. బైకు తాళం తీసి బయటకు తీసుకొచ్చాడు. కిక్ కొట్టబోతూ చూపులటు తిప్పాడు. రోజట్లాగే పక్కింటి వాళ్ల పెంపుడు కుక్క తనను శత్రువులా చూస్తూ కుయ్ కుయ్ రాగాలాపాన అందుకుంది. అలాగే చూస్తున్నాడు. రాగాలాపన ఆరోహణ క్రమంలో బబౌ... నుండి భౌభౌ దాకా చేరుకుంది. కుక్క అన్నా, దాని అరుపన్నా ముత్యాలరావుకు కోపం ముక్కుమీదికొస్తుంది. అదో ఎలర్జీ. కానీ అది తన కుక్క కాదు గదా! "అందుకే నిన్ను కుక్క అన్నారే దొంగముండా!" తనలో తాను గొణుక్కుంటూ బైక్ స్టార్ట్ చేశాడు.

ముండమోపి కుక్క మొరుగుడు అపశకునం కాదు గదా! రోజూ ఎదురొచ్చి మొరుగుతుంది. అందుకే ప్రమోషన్ ఆర్డర్ రావడం లేదేమో! అయినా మనుషులే సమయ సందర్భాలు లేకుండా అరుస్తుంటే పాపం! కుక్కనేమనాలి? ఆ కుక్క స్థానములో మనిషుంటే గల్లాబట్టి నిలదీసేవాడిని... మెదడు పొరల్లో కోల్డ్‌వార్ జరుగుతోంది. బైక్ స్పీడందుకుంది.

ఎదురుగా పరుగెత్తుకొస్తున్న కారుకు సడన్ బ్రేకు పడింది. బుర్రలో భూగోళం గిరికీలు కొట్టింది. ఆలోచనల వలయంలోంచి అసలు లోకానికొచ్చేసరికి బైకు వి.ఐ.పి. కారును ముద్దు బెట్టుకోబోయింది. సడన్‌గా బైకు హ్యాండిల్ పక్కకు తిప్పేశాడు. అది తార్రోడు దిగి కచ్చారోడ్డు మీద పరుగెడుతోంది. పైకి దుమ్మురేగి మొహానికి మేకప్ చేస్తుంటే మరోవైపు కొత్తబైకు పాత సైకిల్లా గడగడలాడిపోయింది. బైకు అద్దములో మొహం రాక్షసావతారంలా కనబడింది. జడుసుకుని చేతిగుడ్డతో మొహం తుడుచుకుంటూంటే వి.ఐ.పి. కారు రివర్స్‌గేర్‌లో వెనక్కొచ్చి బైకు పక్కన ఆగింది. అయ్యబాబోయ్! ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పడకపోతే బతుకు అన్యాయమైపోయేది.

కారువాలా దుమ్ము పెయింట్ అద్దాల డోర్ తెరచి తల బయటకు వంచి చూశాడు. అయ్యయ్యో! అతడు యం.పి. కొడుకు, తిమ్మిని బమ్మి చేయగల సమర్థుడు.

“ఏం రా ముత్యం? ముత్యమంత లేవు. బైకును విమానం స్పీడులా నడుపుతున్నావా? నీ బైకేమన్నా బాంబే ఎక్స్‌ప్రెస్సా? నువ్వేమన్నా బుగ్గకారు మంత్రివా? బుర్ర బీరువాలో పెట్టి తాళమేసొచ్చినవా? బైకు డ్రైవింగ్ సరిగా రాకపోతే మారాజు లెక్క నడిచిపోతే నీ సొమ్మేమన్నా పోతుందా? నేనేమో సెల్‌ఫోన్ల మాట్లాడుకుంట కారు నడుపుతున్న. నీకు కండ్లు కపబడ్తలేవా?” సెల్‌ఫోన్ జేబులో వేసుకుని మొరుగుతూ క్లాసు పీకిండు. ఏం జవాబివ్వాలో తెలీక ఓ క్షణం బుర్ర బుర్రయి పోయింది. వెంటనే తేరుకున్నాడు. అవమాన భారంతో మొహం కందగడ్డయి పోయింది.

“మనం క్లాసుమేట్సుము గదా! మర్యాదలేకుండా అట్లా మొరిగితే ఎట్లా భాయ్? డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడొద్దని రోడ్ల మీద పెద్దపెద్ద బోర్డులున్నై గదా! ఎం.పి. కొడుకైనంత మాత్రాన కండ్లు నెత్తి కెక్కినయా?” ఝాడించి పారెయ్యాలనుకున్నాడు. కాని అతడు... పలుకుబడిలో ఎదురులేనివాడు. ఏమన్నా తిడితే తలకాయమీద మెడకాయుండదు. అయినా బజార్లో ఏనుగు వెల్తాంటే ఎన్ని కుక్కలు మొరగవూ! వీడుగూడా ఓ కుక్క అనుకుంటే సరి... తనను తానే సముదాయించుకుని పెదాలకు చిరునవ్వు అరువు తెచ్చుకున్నాడు.

టీ.వీ. సీరియల్ మధ్యన షార్టు బ్రేకులా కాస్సేపాగి... క్లాసుమేటు, గ్లాసుమేటు మళ్లీ తానే అందుకున్నాడు. “నీ యవ్వ.. గీ మున్సిపల్ రోడ్డు నీ సొంతమనుకున్నావా? ఆఫ్టరాల్ స్పెండర్ బండి... జెట్ విమానమనుకున్నావా? నెలజీతగానివి నువ్వో పైలట్‌వనుకున్నావా?...” గొణుక్కుంటూ తిరిగి కారు స్టార్టు చేశాడు.

రోడ్డుమీదున్న పెద్దమనిషి కారువాలాకు నమస్కరించి “పోనీ.. వదిలేయ్ దొరా! తమరు ప్రజా

సేవకులు. ఇలాంటి మొరుగుడుగాళ్లతోని మాట్లాడ్తుంటే సమయం వృధా అవుతుంది. మీరు వెళ్లండి." ఉచిత సలహా పారేశాడు. కారువాలా ఖుషీగా వెళ్లిపోయిండు. తాను నోరుతెరువలేదు. పెద్దమనిషిలా స్పందించినందుకతన్ని ఎగాదిగా చూశాడు.

"నాదేం తప్పుందన్నా? ఆ కారే నా బైకుమీదికొచ్చింది. అదృష్టం బాగుండి ఆక్సిడెంట్ కాలేదు. నేను జాగ్రత్త పడకపోతే అంతపనీ జరిగేది. అతడేమో సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ యమా స్పీడుమీద కారు నడుపుతున్నడు.... ఇదేమన్నా బాగుందా?" నిలదీసిండు.

"చూడు బాబూ! గట్ల మాట్లాడ్తైనే గసంటోళ్లకు ఖుషీగుంటది. తప్పు అతనిదని తెలుసు. కాని ఏదన్నా లొల్లి అయితే నీదే తప్పంటరు జనాలు. అతడు యం.పి. కొడుకుగదా! ముల్లు ఆకుమీద పడ్డా, ఆకు ముల్లుమీదపడినా ఆకుకే నష్టం. అతడు ముల్లు, నువ్వు ఆకు. ఎందుకంటే పోలీసోల్లు అతని మాటనే నమ్ముతరు నీ మాట వినరుగదా!" జ్ఞాన బోధచేసి కళ్లు తెరిపించాడు.

"మొరిగితే మొరిగినవ్ గాని మంచిమాట చెప్పినవన్నా! అనువుగానిచోట అధికులమనరాదు... నిజమే.." పద్యం గొణుక్కుంటూ బైకు స్టార్టు చేశాడు.

జేబులో ఎలక్ట్రిసిటీ బిల్లు కనబడింది. అరెరే... ఈ బిల్లు కట్టేందు కివ్వాళ్ల లాస్టుడేటు. నాల్రోజుల నుండి జేబులుంది.

బైకు వెనక్కు తిరిగి అటు మల్లింది.

కరంటాఫీసులో... క్యూ హన్మంతుని తోకలాగుంది. ఆపద్బాంధవుడిలా... క్యూ మధ్యన తెలిసినాయన కనిపించాడు. ఆయనతో అబద్ధమాడించి లైన్‌లో చొరబడ్డాడు. క్యూలో ఉన్నవాళ్లంతా నాలాగా పనులు వదిలిపెట్టి వచ్చినవారే. తొందరపడితే లాభంలేదు! ప్రతినెలా అటెండర్ చేతికిస్తే అతడే కట్టేసి వచ్చేవాడు. అదే సాకుగా ఆ పూట డ్యూటీకి డుమ్మా కొట్టేవాడు. పోయిన నెల ధైర్యం పుంజుకుని "అష్టరాల్ కరెంటు బిల్లు కట్టేందుకు ఐదారుగంటల టైమా?" అంటూ చిర్రుబుర్రులాడాడు. అటెండరేమన్నా అర్భకుడా? అమాంతం మింగేస్తానన్నట్టుగా కొరకొర చూస్తూ... "అట్లా అరిస్తే విన్నవాళ్లు కుక్కల కొట్లాట అనుకుంటారు సార్!" తో శ్రీకారం చుట్టి అరగంట గుక్క తిప్పుకోకుండా క్లాసుపీకిండు. ఎరక్కపోయి ఇరుక్కుపోయా ననుకున్నాడు. "ఆఫీసులో అందరికంటే అట్టడుగుస్థాయి ఉద్యోగికంత తలబిరుసా? గొణుక్కున్నాడు. అయినా ఎవరి బిల్లు వారు కట్టుకోవడం కష్టమా? ఈనెల తానే స్వయంగా కట్టేస్తానని కరెంటాఫీసుకొస్తే ఇదీ పరిస్థితి.

క్యూలో నుంచున్నవారు పిచ్చాపాటి బాతాకానిలో మునిగున్నారు. ముందున్నాయనతో ఏదో మాట్లాడ్తూంటే గడియారం ముల్లు ముందుకురుకుతోంది. ఓపిక నశించి కాల్లు పీకుతున్నాయి. చచ్చీచెడి గంటసేపు క్యూలో కుంటుకుంటూ నడిచొస్తే... అప్పుడు వచ్చింది తనవంతు. బిల్లు చెయ్యి కౌంటర్ దాకా వచ్చింది. అవతల బిల్లుకలెక్టరు రాళ్ళూ రోళ్ళూ మోస్తున్నట్లు ఫీలవుతూ ఒళ్లు విరుచుకున్నాడు. 'ఇహ బండి ముందుకు కదలాలంటే ఇంధనం పోయాల్సిందే. ఓ గరంచాయ తాగొస్తా' అంటూ గరంగరంగా కౌంటర్ మూసేశాడు. ముత్యాలరావు అసహనం పురివిప్పి గంతులేసింది. "ఆగుసారూ వైసు పిల్లగానికి.. అలసట అంత త్వరగా వస్తుందా? వివేకానందుడేమన్నాడు.." వాయింపు ప్రారంభించాడు.

"అట్లా అరిస్తే ఎట్లాసార్? మనిషన్నప్పుడు అలసట రాదా?" విసురుగా వెళ్లిపోయాడు బిల్లుకలెక్టరు.

హార్నీ దుంపదెగా! వీడు బిల్లు కలెక్టరా, లేకా జిల్లా కలెక్టరా? నోరెల్లబెట్టాడు. మరో అరగంట నిక్కీ, నీల్గి కరంటు బిల్లుకట్టేశాడు. అప్పుడు గుర్తుకొచ్చింది ఆఫీసు డ్యూటీ. కానీ... తహసీలాఫీసులో కొడుకు లోకల్ క్యాండిడేట్ సర్టిఫికేటు కేసు పెండింగ్‌లో ఉంది. లాంఛనాలన్నీ పూర్తి చేసి అప్లయిచేసి అరవై రోజులైంది. ముందు అటువెళ్లాలి. బైకు అటువైపు పరుగెత్తింది.

ఆశ్చర్యం, అసహనం... తహసీలాఫీసు ఎడారిలాగుంది. సీట్లన్నీ ఖాళీగా కనబడ్డాయి. బయట అటెండర్ బీడీ ఆనందాన్ననుభవిస్తూ ఎవరితోనో ఏదో వ్యవహారం గురించి సీరియస్‌గా మాట్లాడుతున్నాడు. ఒప్పందం కుదరనట్టుంది... కీచులాడుతున్నారు. కుక్కపిల్లలు సయ్యాటలాడుతూ మొరుగుతున్నట్టనిపించి. అదే అటెండరును 'ఈరోజు ఆఫీసుకు సెలవా?' అడిగాడు.

"హాలీడే కాదు జాలీడే. అగో.. మావాళ్లు కొందరక్కడ ఎండ కాగుతున్నరు." చింతచెట్టువైపు చూపించాడు. చలికాలం గదా! నువ్వుగూడా జెరసేపు ఎండల నిల్చో. ప్రాణానికి హాయిగా ఉంటుంది." ఉచిత సలహా పారేశాడు. అటువైపు వెళ్లాడు. ముచ్చట్లాడుతున్న ముగ్గురు లోకాభిరామాయణంలో మునిగున్నారు. వాళ్లను పలుకరించాడు. ఎవ్వరూ కాతరు చేయ్యలేదు. తిరిగి అటెండర్‌వద్ద కొచ్చాడు.

'తహసీల్దారుగారూ లేరా?'

'లేదు. దౌరా మీద పోయిండు.'

'మరి... మిగతా వారంతా ఎక్కడున్నారు?'

'కొందరు ఎండలున్నారు. ఇంకొందరు చాయకు పోయింద్రు.'

'వారెవ్వా! సర్కారాఫీసంటే ఇదన్నమాట. ఆఫీసుటైంకు ఎవ్వరూ రారు. ఆలస్యంగా వచ్చిన వాళ్లు ఎక్కడెక్కడికో పోతరన్నమాట..' ఇంకేదో అనాలనుకున్నాడు. అటెండర్ మొహం మొరగబోతున్న కుక్కమూతిలాగైంది. 'గట్ల మొరగద్దన్నా. ఇది సర్కార్ దప్తర్. గిట్లనే వుంటది. పనుంటే ఉండు లేకపోతే పో...' కసిరాడు.

ఇక్కడ టైం వేస్టు చెయ్యడం కంటే ఆఫీసు సీట్లో కూచుని నిద్రపోవడమే బెస్టు. బైకుమీద బయలుదేరాడు. గబగబా ఆఫీసులో చొరబడ్డాడు. అటెండెన్స్ రిజిష్టర్ కనబడలేదు.

'సార్!' అటెండర్ భుజాలు పునుక్కుంటూ వచ్చాడు.

'కమీష్నర్ సారు మీ కోసమే ఎదిరి చూస్తున్నాడు. టూర్ కేన్సలైపోయిందని గరం గరం గున్నడు. నా మీద అక్షింతలేసిండు వెళ్లండి.' చేతులు పిసుక్కున్నడు.

అయితే నేను ఆలస్యంగా వచ్చిన సంగతి కమీష్నర్‌కు తెలిసిపోయిందన్నమాట. అతని టూరు క్యాన్సలైందని కలగన్నానా? ఎందుకైనా మంచిదని తెల్లకాయితమందుకుని సగంరోజు సెలవుచీటీ రాసి జేబులుంచుకున్నాడు. అసలేమీ జరగనట్టుగా కమీష్నర్ చాంబరు కొచ్చిండు.

"నమస్కారం సార్!" కుర్చీలో కూచోబోయాడు.

"ఆగండి దొరగారూ! అంతా తమరిష్టమేనా?' కమీష్నర్ వెటకారం అరుపు.... కాళ్లల్లో వణుకు పుట్టించింది. రోజూ కన్పిస్తున్న కుక్కల్లో వీడొకడు అనుకున్నాడు. కమీష్నర్‌కు ఎక్కడో మండింది. 'ఆఫీసు

టైం తెలీదా?' గోడగడియారాన్ని కళ్లతో చూపించాడు. 'నెలనెలా జీతం మేస్తున్నప్పుడు నీతి నిజాయితీగా పంజెయ్యాలి. డ్యూటీ ఈజ్ బ్యూటీ అన్నారు తెలుసా? ఏనాడన్నా ఆఫీసుటైం కొచ్చినవా? హక్కులంటూ అరవడం తప్ప బాధ్యతలుంటాయని తెలియదా?' క్లాసందుకున్నాడు. బుర్రలో దెయ్యాలు చెంగలించాయి.


వీడో గురివింద. తానేదో కరెక్టుగా డ్యూటీ చేస్తున్నట్టు నన్ను వాయిస్తున్నాడు... మనసులో అనుకున్నాడు. పైకి అలాగంటే పొట్టు దులిపేస్తాడు... కోపాన్ని రంగరించుకున్న రోశాన్నంతా గొంతులో అదిమిపెట్టక తప్పలేదు. "సారీ సార్!' పులిముందు పిల్లి లాగైపోయాడు. నా భార్య బాత్రూంలో జారి పడిందటా. హాస్పిటల్ తీసుకెళ్లాను. ఎక్సరే తీసి ఫ్రాక్చరన్నారు. కట్టుకట్టించి హాస్పిటల్లోనే ఉంచి ఆఫీసుకొచ్చాను సార్!' అందమైన అబద్దాన్ని సవినయంగా మనవి చేశాడు.

కమీష్నర్ మొహం వికారంగా మారింది. కనుగుడ్లు ముందుకొచ్చినై. కిందిపెదవి మునిపళ్ల మధ్యకొచ్చింది. 'మిస్టర్ ... ముత్యాల్రావ్!' కసిగా టై లాక్కున్నాడు. అది బిగుసుకు పోయిందేమో ఊపిరాడలేదు. తనను తాను సర్దుకున్నాడు. ఊపిరి పీల్చుకుని ఆయాసాన్నాపుకున్నాడు. "ఇంతకుముందే నీ భార్య నీకోసం ఫోన్ చేసిందయ్యా! వాళ్లమ్మగారు బాత్రూంలో జారి పడిందటా. ఆవిడ కాలు విరిగిందని ఫోనొచ్చిందంటా. తాను వెంటనే పుట్టింటికెల్తున్నానంది. ఇంటి తాళంచెవి పక్కింట్లో ఇచ్చి వెల్తున్నానని నీకు చెప్పమంది నాయనా!' కొరుక్కు తింటానన్నట్టుగా మిర్రిమిర్రి చూస్తున్నాడు. అయోమయంలో పడిపోయాడు.

"సారీసర్... క్షమించండి' గుండె గాబరాను తట్టుకోలేక ఛాతీ నిమురుకున్నాడు. ఇవ్వాళ్ల సగంరోజు సెలవు మంజూరు చెయ్యండి.' సెలవుచీటీ జేబులోంచి తీసి టేబుల్ మీదుంచాడు. జవాబు కెదిరిచూడకుండా జెట్ విమానంలా బయటకు పరుగెత్తాడు.

"అదేం పరుగూ... పిచ్చికుక్కలా!" కమీష్నర్ జుట్టు పీక్కున్నాడు.

--- x ---



(చినుకు-అక్టోబర్ 2011)